
సాక్షి
పార్వతీపురం మన్యం

బుధవారం । 9 । ఏప్రిల్ । 2025



పరిశ్రమలు లేవు.. ఉపాధి ఊసే లేదు

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, పారిశ్రామిక రంగంపై ప్రత్యేక దృష్టిసారించి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఉదరగొట్టి అధికారంలోకి వచ్చింది. - 8లో



సారా రహిత జిల్లాగా తీర్చి దిద్దుతాం

సారా రహిత పార్వతీపురం మన్యం జిల్లాగా తీర్చిదిద్దేందుకు పూర్తిస్థాయిలో ప్రణాళికలు రూపొందించామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖాధికారి బి. శ్రీనాథుడు తెలిపారు. - 8లో



సిబ్బంది అవసరాల కోసం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ - 8లో

పోలీస్‌సిబ్బంది అవసరాలకు అనుగుణంగా కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ పని చేస్తోందని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు.

న్యూస్‌రీల్

షెడ్యూల్ మేరకు పదో తరగతి మూల్యాంకనం

- విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్



మూల్యాంకన తీరును పరిశీలిస్తున్న ఆర్‌జేడీ

విజయనగరం అర్బన్: పదో తరగతి వార్షిక పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియను ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ మేరకు ముగించాలని విద్యాశాఖ ఆర్‌జేడీ బి.వి జయభాస్కర్ ఆదేశించారు. విజయనగరం సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి మూల్యాంకన ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. మూల్యాంకన ప్రాంగణంలో టీచర్లకు ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఆయన వెంట డీఈఓ యు.మాణిక్యంనాయుడు, పరీక్షల విభాగం ఏసీ టి.సన్యాసిరాజు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



జిల్లా ఖజానాశాఖ ఉప సంచాలకుడు నాగమహేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగి

విజయనగరం అర్బన్: జిల్లా ఖజానాశాఖ ఉప సంచాలకుడిగా వి.నాగమహేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఆర్ఎస్ కుమార్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం నాగమహేష్‌ను ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా డీటీ అండ్ ఏఓ ఏ.మన్మథరావు, ఏటీఓ కె.శ్రీనివాసరావు, ఉమ్మడి విజయనగరం జిల్లా ఉప ఖజానా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైవాడ కాలువలో ఆటో బోల్తా

- తప్పిన ప్రమాదం
- ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు



కాలువలోంచి ఆటోను తీస్తున్న గ్రామస్తులు

వేపాడ: మండలంలోని బల్లంకి నుంచి ఆనందపురం వెళ్లే రోడ్డులో రైవాడ కాలువపై ఏర్పాటుచేసిన తాత్కాలిక కల్వర్టుపై మంగళవారం ఆటో అదుపు తప్పి కాలువలోకి బోల్తా కొట్టింది. ఆటోలో బల్లంకి గ్రామానికి వెళ్తున్న ముగ్గురు ప్రయాణికులు సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఆటోను స్థానికుల సహాయంతో బయటకు తీశారు. జనవరిలో రైవాడ కాలువపై ఉన్న కల్వర్టు కూలిపోవడంతో గ్రామస్తులు తాటిదుంగలతో తాత్కాలిక కల్వర్టును ఏర్పాటుచేశారు. దీనిపై నుంచి గతంలో పిక్కలారీ వెళ్లడంతో కూలిపోయింది. ఇదే తాత్కాలిక కల్వర్టుపై ఇప్పుడు ఆటో బోల్తాకొట్టింది. జీవీఎంసీ అధికారులు, స్థానిక పాలకులు స్పందించి బల్లంకి-ఆనందపురం రోడ్డు లో రైవాడ కాలువపై శాశ్వత కల్వర్టు నిర్మించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

రూ.3.75 లక్షల స్త్రీనిధి సొమ్ము రికవరీ!

బొబ్బిలి రూరల్: మండలంలోని ముత్తాయివలస గ్రామంలో పొదుపు సంఘాల స్త్రీనిధి రుణాలు పక్కదారి పట్టాయన్న ఆరోపణలతో కొంత మంది సభ్యులు జిల్లా స్త్రీనిధి ఏజీఎం ఉమామహేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. దీనిపై వెలుగు అధికారులు కొద్దిరోజులుగా విచారణ జరిపారు. 10 పొదుపు సంఘాల్లోని 7 సంఘాల రికార్డులు పరిశీలించారు. రూ.3.75 లక్షలు దుర్వినియోగం అయినట్లు తేల్చారు. వీఓఏ నుంచి కొంత మొత్తం ఇప్పటికే రికవరీ చేశామని, మొత్తం సొమ్ము రికవరీ చేస్తామని వెలుగు ఏపీఓ భాగ్యలక్ష్మి తెలిపారు. మరో మూడు సంఘాలను విచారణ జరపాల్సి ఉందన్నారు.

అలజంగి గ్రామంలో..

మండలంలోని అలజంగి గ్రామంలో 108 పొదుపు సంఘాలుండగా గత పదేళ్లలో కోటి రూపాయల మేర రుణాల మంజూరు, రికవరీలో వీఓఏ చేతివాటం చూపినట్లు గ్రామానికి చెందిన 30 సంఘాల సమాఖ్య సభ్యులు కలెక్టర్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ వేగంగా పూర్తయ్యేలా చూడాలని స్థానిక ఎమ్మెల్యే బేబీనాయనకు మంగళవారం విజ్ఞప్తిచేశారు.

వినేవారెవ్వరు...

దివ్యాంగుల వ్యథలు!

- పీజీఆర్ఎస్‌కు వస్తున్న వినతుల్లో దివ్యాంగులే అధికం
- పింఛన్ కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా ప్రయోజనం శూన్యం

దివ్యాంగులకు అర్హతను బట్టి రూ.6వేలు నుంచి రూ.15 వేలు వరకు అందజేస్తాం.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికి తెలుపుకార్డు ఉండి 50 ఏళ్లు నిండితే చాలు పింఛన్ మంజూరు చేస్తాం.. అంటూ ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, స్థానిక కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా కొత్తపింఛన్ల మంజూరు మాటే ఎత్తడం లేదు. దరఖాస్తులు పట్టుకుని తిరుగుతున్న లబ్ధిదారుల గోడు వినిపించుకోవడం లేదు. ప్రతి వారం కలెక్టరేట్‌కు వచ్చి పింఛన్ల మంజూరు కోసం అధికారులకు దరఖాస్తులు అందజేయడం.. నిరాశతో వెనుదిరగడమే లబ్ధిదారుల వంతు అవుతోంది. వారు అందజేసిన వినతులు బుట్టదాఖలవుతున్నాయి.





ఈ చిత్రంలోని మహిళ పేరు తేలు సంతోషికుమారి. మక్కువ మండలం శంబర గ్రామం. ఆమె కుమారుడు మోక్షిత్ పుట్టుకతోనే మానసిక దివ్యాంగుడు. స్వతహాగా కూర్చోలేడు, నిల్చోలేడు, ఏ పనీ చేయలేడు. కుమారుడికి వైద్యం కోసమే నెలకు రూ.4 వేల వరకు ఖర్చవుతోందని ఆమె చెబుతున్నారు. రోజువారీ వ్యవసాయ కూలీ అయిన తన భర్త సంపాదనతో కుటుంబం గడవడమే కష్టంగా ఉంటోందని.. పిల్లవాడి మందులకు ప్రతి నెలా నగదు సమకూర్చుకోవడం తలకుమించిన భారమవుతోందంటూ వాపోయింది. వంద శాతం వైకల్యం ఉన్న తన కుమారునికి పింఛన్ మంజూరు చేయాలని గత డిసెంబర్ 30న శంబర వచ్చిన కలెక్టర్‌ను వేడుకుంది. వెంటనే ఆయన స్థానిక తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇప్పటి వరకు మోక్షిత్‌కు పింఛన్ మంజూరు కాలేదు. సదరం ధ్రువపత్రం పట్టుకుని, తన కుమారుడిని వెంటబెట్టుకుని అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉంది.



ఈ చిత్రాల్లో మం చానికే పరిమితమై, మరొకరి సహాయంతో వస్తున్న దివ్యాంగుడి పేరు నారాయణపురం విజయ్‌కుమార్. వీరఘట్టం మండలం దశుమంతపురం గ్రామం. వంద శాతం అంధత్వం, వంద శాతం వైకల్యంతో పూర్తిగా మంచానికే పరిమితమైపోయాడు. మరొకరి సాయం ఉంటే గానీ.. ఇల్లు విడిచి బయటకు రాలేని పరిస్థితి. తనకు దివ్యాంగ పింఛన్ కింద రూ.6 వేలు అందుతోంది. పూర్తిస్థాయిలో వైకల్యం ఉండి, మంచానికే పరిమితమైన వారికి ప్రభుత్వం రూ.15 వేలు పింఛన్ ఇస్తామని ప్రకటించిందని.. ఆ మేరకు మొత్తం తనకు అందించాలని అధికారుల చుట్టూ మరొకరి సాయంతో తిరుగుతున్నాడు.



చిత్రంలోని బాలుడి పేరు బమ్మిడి ఇనోస్ పాల్. బలిజిపేట మండలం అంపావల్లి గ్రామం. పుట్టుకతోనే మూగ, చెవిటి. తన కుమారునికి దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని తండ్రి జోగారావు ఎన్నోసార్లు అధికారులను కలసి వేడుకుంటున్నా.. ఫలితం ఉండటం లేదు. 83 శాతం వైక్యలం ఉన్న తన కుమారుడు పింఛన్‌కు అర్హుడు కాదా? ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఈమె పేరు కోట గౌరమ్మ. సీతానగరం మండలం బూర్జ గ్రామం. ఈమెకు వస్తున్న దివ్యాంగ పింఛన్‌ను కొన్ని రోజుల కిందట తొలగించారు. తన పింఛన్‌ను పునరుద్ధరించాలని అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉంది. వారి సూచనల మేరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి ప్రయత్నిస్తే తిరస్కరణకు గురవుతోంది. సదరం ధ్రువపత్రం 'ఇన్‌వ్యాలిడ్' అని చూపుతోంది. మరలా సదరం ధ్రువపత్రానికి దరఖాస్తు చేసుకుంటే.. ఈ ఆధార్ నంబరుతో ఇప్పటికే సదరం పత్రం మంజూరైనట్లు వస్తోంది. దీంతో ఆమె ఎన్నిసార్లు ప్రయత్నం చేస్తున్నా.. పింఛన్ కోసం కనీసం దరఖాస్తు చేసుకోలేకపోతోంది. అధికారులు తన మొర వినాలని వేడుకుంటోంది.

సాక్షి, పార్వతీపురం మన్యం: ప్రతీవారం కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వినతులిచ్చిన వారిలో దివ్యాంగులే అధికంగా ఉంటున్నారు. నడవలేని స్థితిలో.. మంచానికే పరిమితమై.. ఇలా ఒక్కొక్కరిదీ ఒక్కో వ్యథ.. మరొకరి మీద ఆధారపడకుండా.. కనీసం మందుల ఖర్చుకైనా పింఛన్ డబ్బులు పనికొస్తాయనుకుంటే.. కాళ్లరిగేలా తిరుగుతున్నా, కనికరించేవారే కరవవుతున్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద దివ్యాంగులకు, కదలలేని స్థితిలో ఉన్నవారికి పింఛన్ మొత్తం రూ.4 వేల నుంచి ఆయా తీవ్రతను బట్టి రూ.15 వేల వరకు అందిస్తున్నామని కూటమి ప్రభుత్వం గొప్పగా చెప్పుకొంటోంది.

జిల్లాలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు.. ఇలా అన్ని రకాలూ కలిపి 1,39,752 మందికి పింఛన్లు అందుతున్నాయి. దివ్యాంగులకు పెద్ద ఎత్తున పింఛన్లు అందిస్తున్నామని కూటమి నేతలు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో అర్హులు కోకొల్లలుగా ఉన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమానికి పింఛన్ కోసం వస్తున్న దరఖాస్తులు అధికంగానే ఉంటున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నుంచి ఇప్పటి వరకు జిల్లాలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 29,778 అర్జీలు అందాయి. వీటిలో 29,365 అర్జీలను పరిష్కరించినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలినవి పరిష్కార దశలో ఉన్నట్లు లెక్కలు చూపుతున్నారు. పదేపదే కలెక్టరేట్‌కు తిరుగుతున్నా ఈ దివ్యాంగుల అర్జీలను పరిగణనలోకి తీసుకుంటున్నారో.. లేక బుట్టదాఖలు చేస్తున్నారో అధికారులకే తెలియాలి.

కంటైనర్ అంగన్‌వాడీ కేంద్రం



చిత్రంలో కనిపిస్తున్నది నర్సిపురం గ్రామంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణకు ఆ గ్రామ సచివాలయం వద్ద అధికారులు ఏర్పాటు చేసిన కంటైనర్. నూతన భవనం నిర్మించే వరకు ఈ కంటైనర్‌లోనే అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతుందని సీడీపీఓ శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటికే భామినిలో ఓ అంగన్‌వాడీ కేంద్రాన్ని, సాలూరు, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఆస్పత్రులను సైతం కంటైనర్‌లోనే నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. కంటైనర్ ఏర్పాటుపనులను ఎంపీడీఓ రమేష్ బాబు, తహసీల్దార్ వై.జయలక్ష్మి తదితరులు మంగళవారం పరిశీలించారు.

- పార్వతీపురం రూరల్

డిప్యూటీ సీఎం తీరుపై నిరసన



బొడ్డవర నుంచి ఎస్.కోటకు పాదయాత్రగా వస్తున్న గిరిజనులు, సీపీఎం నాయకులు

శృంగవరపుకోట: గిరిజన గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు వినిపించేందుకు ఎస్.కోట మండలంలోని ధారపర్తి పంచాయతీ వాసులు సోమవారం మండుటెండలో విశాఖ- అరకు రోడ్డులో ఎదురు చూశారు. ఆయన కాన్వాయ్ ఆగకుండా వెళ్లిపోవడంతో నిరాశ చెందారు. దీనికి నిరసనగా బొడ్డవర నుంచి ఎస్.కోట వరకు మంగళవారం పాదయాత్రగా వచ్చి ఎండీఓకు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ, ధారపర్తి సర్పంచ్ సన్నిబాబు, మాజీ సర్పంచ్ ఎం.బుచ్చన్న, ఎర్రయ్య, అరుణ్, జోషి తదితరులు మాట్లాడుతూ గిరిజన గ్రామాల ప్రజలకు డోలీ మోతలు తప్పడం లేదన్నారు. రోడ్లు, కాలువలు, తాగునీరు, విద్య, వైద్యం వంటి సదుపాయాలు అక్కరకు రావడంలేదని వాపోయారు. గిరిజన ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించేవారే కరువయ్యారన్నారు. ఎన్నికల సమయంలో గిరిజనులపై చూపించే ప్రేమ తర్వాత నేతల్లో కరువవుతోందన్నారు. గిరిజనుల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించేవారే లేరని వాపోయారు.

వినూత్న నిరసన



తలపై కర్రలమోపు పెట్టుకుని నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకుడు కొల్లు సాంబమూర్తి

కొమరాడ: ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకుడు కొల్లు సాంబమూర్తి డిమాండ్ చేశారు. ధర పెంపునకు నిరసనగా కొమరాడలో కర్రలమోపు తలపై పెట్టుకుని మంగళవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర సరుకులు, గ్యాస్ ధరలు పెంచి పేదలపై పెనుభారం మోపుతున్నాయన్నారు. గ్యాస్ ధరలు తగ్గించకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

ఎరుకలపేటలో ఏనుగుల గుంపు



వెంకటరాజపురం పంట పొలాల్లో ఉన్న ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట పంచాయతీ ఎరుకలపేట, వెంకటరాజపురం పంట పొలాల్లో ఏనుగులు మంగళవారం దర్శనమిచ్చాయి. ఉదయం సుభద్రమ్మవలసలో అరటి, పామాయిల్ తోటల్లో ఉన్న ఏనుగులు సాయంత్రానికి ఎరుకలపేట, వెంకటరాజపురం పరిసర ప్రాంతాల్లోకి చేరుకున్నాయి. మరో నెల రోజుల్లో చేతికందే వరిపంట పొలాల్లో సంచరించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రతి వసతిగృహంలో సీసీ కెమెరాలు

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలోని ప్రతి వసతిగృహంలో నెల రోజుల్లోగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి విద్యార్థుల నడవడికను గమనించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ వసతిగృహ సంక్షేమాధికారులను ఆదేశించారు. వసతి గృహంలో చదివే విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పాలన్నారు. వసతి గృహంలో చేరిన నాటి నుంచి విద్యాభ్యాసం ముగిసి బయటకు వెళ్లే వరకు విద్యార్థుల బాగోగులు చూడాల్సిన బాధ్యత సంబంధిత హెచ్‌డబ్ల్యూలదేనన్నారు. ఆశావాహ జిల్లాగా పార్వతీపురం మన్యం ఎంపికైందని, వసతిగృహాల్లో చదివే విద్యార్థుల ఆరోగ్య ప్రమాణాలు మెరుగ్గా ఉండాలని కలెక్టర్ స్పష్టంచేశారు. 11 శాతం కంటే అధికంగా హిమోగ్లోబిన్ ఉండేలాలా చూడాలన్నారు. బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే ఉపాధ్యాయులపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రతీ వసతిగృహంలో షీ కంప్లైంట్ బాక్సులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. క్రిమికీటకాలు రాకుండా ప్రహరీ పరిసరాల్లో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖాధికారి మహ్మద్ గయాజుద్దీన్, దివ్యాంగుల సంక్షేమశాఖాధికారి కె.కవిత, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ కృష్ణవేణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, బీసీ సంక్షేమ శాఖాధికారి ఇ.అప్పన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మలేరియాతో జాగ్రత్త

జిల్లాలో మలేరియా వ్యాప్తి చెందకుండా వైద్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. మలేరియా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందజేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డా. భాస్కరరావు, ప్రోగ్రాం అధికారులు వినోద్, జగన్‌మోహన్‌రావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.వాగ్దేవి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీకి బకాయిల రోగం

- జిల్లాలో గత పది నెలల్లో రూ.6కోట్ల బకాయిలు
- బిల్లుల విడుదల కోసం ఎదురు చూస్తున్న నెట్‌వర్క్ ఆస్పత్రులు
- జిల్లాలో ఏడు ఆరోగ్యశ్రీ, నెట్‌వర్క్ ఆస్పత్రులు
- సేవలు నిలిచిపోవడంతో పేదల ఆరోగ్యానికి భరోసా కరువు



పార్వతీపురం టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని రంగాలను చిన్నచూపు చూస్తోంది. రైతు, విద్యార్థుల సంక్షేమంతో పాటు ప్రజారోగ్యాన్ని పక్కన పెట్టింది. కేవలం అమరావతి అభివృద్ధిపైనే దృష్టిసారించింది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆరోగ్య భరోసా కల్పించే ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్యసేవ) పథకానికి నిధులు కేటాయించకుండా ప్రజల ప్రాణాలను గాలిలో దీపంలా మార్చడంపై జనం మండిపడుతున్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు చెల్లింపులో జాప్యం వల్లే సేవలు నిలిపివేశారని, తక్షణమే బిల్లులు చెల్లించి ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కింద జిల్లాలోని నెట్ వర్క్ ఆస్పత్రులకు రూ.300 కోట్ల మేర బిల్లులు చెల్లించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలల్లో కేవలం రూ.6 కోట్లు బకాయిలు చెల్లించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గతంలో ప్రజారోగ్యానికి పెద్దపీట

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమిచ్చింది. ధనవంతులకే పరిమితమైన ఫ్యామిలీ డాక్టర్ వైద్యాన్ని పల్లెప్రజలకు చేరువచేసింది. ఆరోగ్యశ్రీ వైద్యఖర్చు పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచింది. ఆరోగ్య ఆసరా కింద రోగులు కోలుకునేందుకు వీలుగా భృతి చెల్లించింది. ప్రజారోగ్యానికి పూర్తి భరోసా కల్పించింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ సేవలన్నింటిపైనా నిర్లక్ష్యం వహించడంతో పేద, మధ్యతరగతి వర్గాలు ఆవేదన చెందుతున్నాయి.

రూ.6 కోట్ల వరకు బకాయిలు

జిల్లాలోని ఆరోగ్యశ్రీ(ఎన్టీఆర్ వైద్యసేవ) నెట్ వర్క్ ఆస్పత్రులకు రూ.6 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు రోగులకు సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కొయ్యాన అప్పారావు, ఆరోగ్యశ్రీ డీసీ, పార్వతీపురం మన్యం

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి


అమ్మవారికి చేసిన పుష్పాలంకరణ

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, నేతేటి ప్రశాంత్‌లు అమ్మవారికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఇన్చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


మృతుడు అప్పలనాయుడు

గంట్యాడ: మండలంలోని నరవ గ్రామంలో గల ఎర్ర చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. మంగళవారం ఉదయం చెరువులో మృతదేహం తేలడంతో అటు వైపు వెళ్లిన గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి మృతుడిని నరవగ్రామానికి చెందిన గేదెల అప్పలనాయుడుగా గుర్తించారు. ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

విజయనగరం క్రైమ్: కోరుకొండ రైల్వేస్టేషన్ ఆవరణలో గుర్తు తెలియని మృతదేహం పడి ఉన్నట్లు విజయనగరం రైల్వే పోలీసులకు సమాచారం లభించింది. ఇందుకు సంబంధించి జీఆర్‌పీ సిబ్బంది తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. విజయనగం–కోరుకొండ రైల్వేలైన్ ప్రాంతం గుండాలపేట వద్ద 45 నుంచి 50 ఏళ్ల వయస్సు కలిగిన ఓ వ్యక్తి మృతదేహాన్ని జీఆర్పీ సిబ్బంది గుర్తించారు. అయిదున్నర అడుగుల పొడవు కలిగి ఉండి బూడిద రంగు చొక్కా, బిస్కెట్ రంగు ఫ్యాంట్ ధరించిన వ్యక్తి రైలు పట్టాలపై పడి ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇచ్చిన మేరకు జీఆర్‌పీ హెచ్‌సీ క్రష్ణారావు ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గుర్తించగలిగే వారు ఎవరైనా ఫోన్ 9490617089, 9441013330, 08912883218 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వెట్టిచాకిరీ ఘటనపై ఎస్టీ కమిషన్ చైర్మన్ ఆగ్రహం


డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: బాపట్ల జిల్లా రేపల్లె మండలం బొబ్బర్లంకకు చెందిన ఎస్టీ సామాజిక వర్గ దంపతుల వెట్టిచాకిరీ ఘటనపై జిల్లా అధికారులు సమగ్ర నివేదిక పంపాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు ఆదేశించారు. తమతో వెట్టిచాకిరీ చేయస్తున్నారంటూ నంబూరి పద్మ, అగ్రి దంపతులు ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన బాపట్ల కలెక్టర్‌ను చైర్మన్ అభినందించారు. వెట్టిచాకిరీ చేయించడంతో పాటు, ఆ దంపతులను అమ్మకానికి పెట్టడం పైఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి పరిణామాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు పేర్కొన్నారు.

తైక్వాండో బ్లాక్ బెల్ట్ పరీక్షలో విజేతలకు అభినందన

విజయనగరం: జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్‌బెల్ట్ టెస్ట్‌లో అర్హత పొందిన క్రీడాకారులను హోటల్ జీఎస్‌ఆర్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పలువురు అభినందించారు. ఇటీవల నిర్వహించిన అర్హత పరీక్షలో వి.రోహిణి, చరిష్మా, కె.నిత్య, డి.ప్రియవల్లి, దేవస్ ఫస్ట్ డాన్ బ్లాక్‌బెల్ట్ సాధించగా..వి కుశాల్, పి.పునీత్, ఎస్.సాత్విక్, వై. ముఖేష్, టి.సంకీర్తన, వి.యశ్మిత, సూర్య, కె.సాహిత్య సెకెండ్ డాన్ బ్లాక్ బెల్ట్ టెస్ట్‌లో అర్హత సాధించారు. వారికి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు, సత్య ఐటీఐ విద్యాసంస్థల కరస్పాండెంట్ అల్లు శ్రీకాంత్ సర్టిఫికెట్‌లు ప్ర దానం చేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డి.ప్రసాద్, రాజేష్, కోచ్ యశస్విని పాల్గొన్నారు.

పరిశ్రమలు లేవు.. ఉపాధి ఊసే లేదు

- పదినెలలు గడుస్తున్నా కానరాని పరిశ్రమలు
- నియోజకవర్గానికో ఎంఎస్‌ఎంఈ పార్క్ అంటూ ఎన్నికల ప్రచారం
- జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు ఒకటే పార్క్ లేఅవుట్
- మిగిలిన మూడు నియోజక వర్గాల్లో ప్రతిపాదనలకే పరిమితం
- జిల్లాలో అధిక మొత్తంలో గిరిజన ఉత్పత్తులు
- పరిశ్రమలు లేక దళారుల పాలవుతున్న ఉత్పత్తులు



ప్రతిపాదనలకే పరిమితం

పార్వతీపురంటౌన్: ఎన్నికల ముందు అధికారం దక్కించుకునేందుకు కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, పారిశ్రామిక రంగంపై ప్రత్యేక దృష్టిసారించి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఉదరగొట్టి అధికారంలోకి వచ్చింది. అధికారం చేపట్టి పదినెలలు గడుస్తున్నా ఆచరణలో ముందడుగు వేయడం లేదు. అధికారం చేపట్టిన తరువాత జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోనూ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని, ప్రతి నియోజకవర్గంలో మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ పార్క్‌లు ఏర్పాటు చేస్తామని ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో ఒక్కో ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటు చేసి చిన్నపాటి పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పార్కుల్లో మౌలిక వసతులు కల్పించి పారిశ్రామిక వేత్తలు, పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టి వాటి ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్న ఆశలను యువతలో కల్పించారు. తీరా పదినెలలు గడుస్తున్నా పరిశ్రమల ఊసెత్తక పోవడంతో యువతలో ఆందోళన నెలకొంది.

ప్రతిపాదనలకే పరిమితం

పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన వనరులు, గిరిజన ఉత్పత్తులు జిల్లాలో మెండుగా ఉన్నాయి. ఎక్కువ సంఖ్యలో భూములు సైతం ఉన్నాయి. కానీ ప్రభుత్వం, అధికారుల మధ్య సమన్వయ లోపంతో జిల్లాలో ఇప్పటివరకు ఒక్క పరిశ్రమకు గాని, పరిశ్రమల ఏర్పాటుకు గాని చర్యలు చేపట్టడం లేదు. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని అధికారులు చెబుతున్నారే తప్ప పనులు మాత్రం జరగడం లేదు. చిన్నపాటి పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఔత్సాహికులు ముందుకు వస్తున్నప్పటికీ ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు, వాటిలో సౌకర్యాలు కల్పించేందుకు సరైన స్పష్టత లేకపోవడంతో పరిశ్రమలను ఏవిధంగా ఏర్పాటు చేస్తామని ఔత్సాహికులు వెనుదిరుగుతున్న పరిస్థితి నెలకొంది.

జిల్లాలో పరిస్థితి ఇలా..

పార్వతీపురం నియోజకవర్గంలోని పార్వతీపురం మండలంలో గల చందలింగి గ్రామంలో ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కురుపాం నియోజకవర్గం గరుగుబిల్లి మండలం మండలం చిలకాం గ్రామంలో స్థల పరిశీలన చేశారు. పాలకొండ నియోజకవర్గం సీతంపేట మండలం పణుకువలస గ్రామ సమీపంలో లే అవుట్లు పరిశీలించి మంజూరు చేశారు. ప్రస్తుతానికి ఎటువంటి పనులు ప్రారంభించలేదు. సాలూరు నియోజకవర్గంలో స్థల పరిశీలన, ప్రతిపాదనలు వంటివి కనీసం మొదలు పెట్టలేదు. జిల్లాలో చిన్నపరిశ్రమల ఏర్పాటు కలగానే ఉందంటూ స్థానికుల్లో ఆందోళన నెలకొంది. ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటు కోసం ప్రతి నియోకవర్గంలో 50 ఎకరాలకు తగ్గకుండా భూములు గుర్తించాలి. ఇక్కడ రోడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలి. జిల్లాలో గిరిజన ప్రాంతం ఎక్కువగా ఉండడంతో స్థల సేకరణకు అధికారులు నానా పాట్లు పడుతున్నారు.

స్థల పరిశీన చేశాం

ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో గల కురుపాం, పాలకొండ, పార్వతీపురం నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు భూములు గుర్తిస్తున్నాం. కొన్నిచోట్ల భూములు అందుబాటులో ఉన్నాయి. సాలూరు నియోజకవర్గంలో స్థల పరిశీలనకు చర్యలు చేపట్టాం. స్థలాలు గుర్తించిన వాటికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం.

– ఎంవీ కరుణాకర్, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్

ప్రత్యేకాధికారుల నియామకం..

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలోని నియోజకవర్గాలు, మండలాలు, మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండల ప్రత్యేకాధికారులు ప్రతి శుక్రవారం మండలాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. మండల అభివృద్ధిపై వారు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తారన్నారు. అన్ని శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలు తనిఖీ చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు

పార్వతీపురం నియెజకవర్గానికి ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, పాలకొండ నియోజకవర్గానికి సబ్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి, కురుపాం నియోజకవర్గానికి కేఆర్ ఆర్‌సీ ఎస్‌డీసీ పి.ధర్మచంద్రా రెడ్డి, సాలూరు నియోజకవర్గానికి డ్వామా పీడీ రామచంద్రా రెడ్డిని నియమించారు.

'మున్సిపాల్టీల ప్రత్యేకాధికారులు

సాలూరు మున్సిపాల్టీకి డీవీఈఓ డి.మంజులావీణ. పార్వతీపురం మున్సిపాల్టీకి ఐటీడీఏ ఏపీఓ ఎ.మురళీధర్, పాలకొండ మున్సిపాల్టీకి సీతంపేట ఏపీఓ జి.చినబాబులను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

మండలాల వారీగా ప్రత్యేకాధికారులు	
మండలం	అధికారి
పాచిపెంట	జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వి.రామకృష్ణ.
బలిజిపేట	జిల్లా వ్యవసాయశాఖాధికారి కె. రాబర్ట్‌పాల్
గరుగుబిల్లి	జిల్లా గ్రామీణ నీటి సరఫరా అధికారి ఒ.ప్రభాకరరావు
మక్కువ	జిల్లా ఉద్యానశాఖాధికారి బి.శ్యామల
పార్వతీపురం	డీఆర్‌డీఏ పీడీ సుధారాణి
కొమరాడ	జిల్లా భూగర్భ జలాల అధికారి ఎ.రాజశేఖరరెడ్డి
సీతానగరం	సివిల్ సప్‌లైస్ డీఎం ఐ.రాజేశ్వరి
సాలూరు	జీసీసీ డీఎం మహేంద్ర కుమార్
పాలకొండ	జిల్లా పశుసంవర్థకశాఖాధికారి డాక్టర్ ఎస్.మన్మథరావు
వీరఘట్టం	సీపీఓ వీర్రాజు
గుమ్మలక్ష్మీపురం	ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ
కురుపాం	సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్ తేజేశ్వరరావు
సీతంపేట	పాలకొండ డివిజనల్ అభివృద్ధి అధికారి వీవీ గోపాలకృష్ణ భామిని, డీఆర్‌డీఏ ఏపీడీ వై.సత్యంనాయుడు
జియ్యమ్మవలస	జిల్లా పంచాయతీ అధికారి టి. కొండలరావు

గ్రామస్థాయి కమిటీల ద్వారా జీడి పిక్కలు కొనుగోలు చేయాలి

- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ


అధికారులతో సమీక్షిస్తున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ

పార్వతీపురం: గ్రామస్థాయి కమిటీల ద్వారా జీడి పిక్కలను కొనుగోలు చేయాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఐటీడీఏ కార్యాలయంలో జీడి పిక్కల కొనుగోలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడిపిక్కల కొనుగోలుకు సంబంధించి 8 మండలాల్లో 20 గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి వాటి ద్వారా కొనుగోలు చేయాలని సూచించారు. జీడి కనుగోళ్ల యాప్ నిర్వహణపై ఈనెల 9న శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అలాగే ఈనెల 10, 11 తేదీల్లో రస్తా కుంటుబాయిలో 8 మండలాల గ్రామస్థాయి కమిటీ సభ్యులకు కేవీకేలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నాణ్యమైన జీడిపిక్కలను కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి, వెలుగు ఏపీడీ వై.సత్యంనాయుడు, ఐటీడీఏ ఏపీఓ మురళీధర్ తదితరులున్నారు.

స్టాఫ్ నర్సులకు శిక్షణ సర్టిఫికెట్ల అందజేత

పార్వతీపురం టౌన్: పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాలు మెరుగుపడేందుకు, శిక్షణ నైపుణ్యాన్ని సద్వినియోగం చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డా.ఎస్ భాస్కరరావు సూచించారు. సాధారణ ప్రసవాలపై రీఓరియంటేషన్ శిక్షణ పూర్తి చేసుకున్న స్టాఫ్ నర్సులకు ఆరోగ్య కార్యాలయంలో మంగళవారం ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. బ్యాచ్‌ల వారీగా పీహెచ్‌సీ స్టాఫ్‌నర్సులకు అందజేసిన శిక్షణలో రెండ బ్యాచ్‌కు గత నెల 19న ప్రారంభించి ఈ నెల 8వరకు 21 రోజులు జిల్లా ఆస్పత్రి, ఆరోగ్య కార్యాలయంలో శిక్షణ అందించామని తెలిపారు. గర్భిణుల ఆరోగ్యపరీక్షలు, ప్రసవం, ప్రసవ సమయంలో తలెత్తే సమస్యలను నివారించడంలో నైపుణ్యం పెంపొందించడం, ప్రసవానంతర కాలంలో బాలింత, శిశువులకు ప్రాథమిక, అత్యవసర సంరక్షణ అందించడం, హైరిస్క్ ఆరోగ్య సమస్యలు ముందుగానే గుర్తించి ప్రమాధకర పరిస్థితులకు దారి తీయకుండా సురక్షిత, సాధారణ ప్రసవంపై శిక్షణలో తెలియజేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డా.జగన్ మోహనరావు, డా.రఘుకుమార్, డా.వినోద్‌కుమార్, డీసీహెచ్ఎస్ఓ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: ఏపీ డీఎస్సీ ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్స్ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురజాడ అప్పారావు బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ జె.జ్యోతిశ్రీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీలోగా కస్పా హైస్కూల్ వద్ద ఉన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులు అందజేయాలన్నారు. విజయనగరం జిల్లాకు చెందిన బీసీ, ఈడబ్ల్యూఎస్ (ఈబీసీ) వర్గాలకు చెందిన అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నేటివిటీ, టెట్‌మార్క్స్ జెరాక్స్, రెండు పాస్ ఫొటోలు దరఖాస్తుకు జతచేయాలన్నారు. వివరాలకు సెల్: 96035 57333, 9177 726454 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వంటగ్యాస్ ధరలు తగ్గించాలి


గ్యాస్ సిలిండర్‌తో నిరసన తెలియజేస్తున్న మహిళలు

సీతానగరం: ప్రజలు నిరంతరం వినియోగించే వంటగ్యాస్‌పై పెంచిన ధరలు తక్షణమే తగ్గించాలని కోరుతూ మహిళలు మండలకేంద్రంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టిన 10 నెలల్లో వంటగ్యాస్ ధరలు గణనీయంగా పెంచడంతో పాటు, ఉచితంగా వంటగ్యాస్ ఇస్తామని, సిలిండర్లు ఇస్తామని ఇచ్చిన హామీ అమలు చేయడంలో విఫలమయ్యారని అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీపీఎం మండల నాయకులు జి.మాలతి, జీవీ రమణ మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీ మిత్రులకు లాభం చేకూర్చే విధంగా వంటగ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు పెంచి సామాన్యులపై ఆర్థిక భారం అదనంగా మోపడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఎన్డీయే ప్రభుత్వంలో ఉన్న భాగస్వామ్య పార్టీలు స్పందించి ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను విధిగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పి.గంగమ్మ, ఎం. సత్యవతి, ఎస్.లక్ష్మి, బి.అప్పయ్యమ్మ పాల్గొన్నారు.

రాళ్లు తేలిన రహదారిపై అవస్థలు


గుంతలతో అధ్వానంగా ఉన్న సంగంవలసకు వెళ్లే రహదారి


రహదారిపై గుంతలతో రాళ్లు తేలి అధ్వానంగా ఉన్న వెంకంపేట రహదారి

పార్వతీపురం రూరల్: మండలంలోని పలుగ్రామాలకు వెళ్లేందుకు ప్రయాణికులు తీవ్రస్థాయిలో అవస్థలు ఎదుర్కొంటున్నారు. రహదారిపై అక్కడక్కడ ఏర్పడిన గుంతలు, రాళ్లు తేలిన రహదారిపై ప్రయాణించేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. వెంకంపేట గోరీల జంక్షన్ నుంచి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లేందుకు ఉన్న రహదారి అధ్వానంగా ఉండడంతో ఈ రహదారిపై ప్రయాణించే వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. సంగంవలస, పులిగుమ్మి నుంచి బందలుప్పికి వెళ్లే రహదారి, అడ్డాపుశీల గ్రామ ప్రారంభంలో, అలాగే చినబొండపల్లినుంచి ఎమ్మార్‌నగరం వెళ్లే రహదారి గోతుల మయం కావడంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు మరమ్మతుల బారిన పడుతున్నాయి. రోడ్డుపై గోతుల కారణంగా ప్రయాణికుల ఒళ్లు హూనమవుతోంది. వర్షం పడితే గోతుల్లో నీరు చేరి ఏ గొయ్యి ఎక్కడ ఎంత ఉందో తెలియక వాహన చోదకులు అదుపుతప్పి పడిపోయే పరిస్థితి ఏర్పడుతోందని వాహన చోదకులు, స్థానిక గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సురక్షితమైన రహదారిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సిబ్బంది అవసరాల కోసం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ

- ఎస్పీ వకుల్ జిందల్
- డీపీఓలో కో ఆపరేటివ్ సొసైటీ వార్షిక సమావేశం


కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, చిత్రంలో ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: పోలీస్‌సిబ్బంది అవసరాలకు అనుగుణంగా కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ పని చేస్తోందని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ వార్షిక సమావేశంలో ముఖ్య అతిథులుగా ఎస్పీతోపాటు ఏఎస్పీ సౌమ్యలత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమంలో భాగంగా వారి అవసరార్థం ఆర్థికపరంగా ఆదుకోవడానికి క్రెడిట్ సొసైటీ ఏర్పాటు జరిగిందన్నారు.తక్కువ వడ్డీకి కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా రుణాలు పొందవచ్చన్నారు. కుటుంబ అవసరాలైన పిల్లల చదువులు, వివాహాలు, గృహ నిర్మాణాల కోసం సిబ్బంది పే స్కేల్ ఆధారంగా రుణాలు పొందవచ్చని చెప్పారు. కాగా 2024–2025 ఆదాయ వ్యయాల,సంక్షేమానికి సొసైటీ తీసుకున్న, అమలు చేసే చర్యలను సభ్యలకు ఎస్పీ తెలియజేశారు. సిబ్బంది తీసుకున్న సభ్యత్వం,సర్వీస్ ఆధారంగా ఇప్పటికే రూ. మూడు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు వ్యక్తిగత రుణాలను అందజేస్తున్నామని తెలిపారు. వెల్ఫేర్‌లో భాగంగా కో ఆపరేటివ్ సభ్యత్వం కలిగిన టెన్త్, ఇంటర్ చదివిన సిబ్బంది పిల్లలకు రూ.లక్షా,87 వేల 500 స్కాలర్‌షిప్‌లను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా సిబ్బంది పిల్లలు ఎక్కడ చదువుతున్నదీ?ఎంత ర్యాంక్ తెచ్చుకున్నారు వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎస్పీ సీఐ చౌదరి, ,ఏఆర్ ఆర్ఐ గోపాలనాయుడు కో ఆపరేటివ్ సెక్రటరీ నీలకంఠం నాయుడు, డైరెక్టర్లు రామకృష్ణ, ఈశ్వరరావు, విజయ్‌చందర్, చిన్నారావులతో పాటు,పోలీస్ అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తామరఖండిలో ఘనంగా సిరిమానోత్సవం


సిరిమానుపై అధిష్టించిన పూజారి ఆశీర్వదిస్తున్న చిత్రం



కాళ్లకు కర్రలు కట్టి విన్యాసాలు చేస్తున్న భక్తులు


తిరువీధిలో అమ్మవారి ఘటాలతో భక్తులు

సీతానగరం: మండలంలోని తామరఖండి, రేపటివలస గ్రామాల ప్రజలు ఆరాధ్య దైవంగా పూజించే పెద్దమ్మవారి జాతరను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం వేలాది మంది భక్తుల సమక్షంలో సిరిమానోత్సవం ఘనంగా జరిగింది. ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభమైన పెద్దమ్మవారి జాతర సందర్భంగా రాత్రివేళలో అమ్మవారి ఊరేగింపుతోపాటు కళాప్రదర్శనలు,నాటక ప్రదర్శనలు జరిగాయి. మంగళవారం సాయంత్రం తామరఖండి గ్రామం పురవీధుల్లో అమ్మవారి ఘటాలు, మరగాలతో విన్యాసాలు చేస్తున్న భక్తులు, సిరిమానుతో పాటు ఘటాలతో తిరువీధి గావించారు. బుధవారం ఉదయం అనుపోత్సవం జరుగుతుంది.

సారా రహిత జిల్లాగా తీర్చి దిద్దుతాం

- ఎక్సైజ్ శాఖాధికారి బి. శ్రీనాథుడు
- ఏఓబీ గ్రామాల్లో ఎక్సైజ్ సంయుక్త దాడులు


ఏఓబీ గ్రామాల్లో సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

పార్వతీపురం టౌన్: సారా నియంత్రణే ధ్యేయంగా ఎక్సైజ్‌శాఖ పనిచేస్తుందని, సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పూర్తిస్థాయిలో ప్రణాళికలు రూపొందించామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖాధికారి బి. శ్రీనాథుడు తెలిపారు. ఈ మేరకు ఆంధ్రా, ఒడిశా ఎక్సైజ్ సిబ్బందితో మంగళవారం సరిహద్దు గ్రామాలైన సులభ, పెండిమ, కెరడ, వలవ, వనజ గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దాడుల్లో 11,200 పులిసిన బెల్లపు ఊట, 200లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు తెలిపారు. సారా తయారీకి వినియోగిస్తున్న ప్లాస్టిక్ డ్రమ్ములు, బకెట్లు, నల్లబెల్లం వంటివి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఒడిశా రాష్ట్రంలో తయారైన సారా పార్వతీపురం, విజయనగరం, విశాఖపట్నం వరకు అక్రమంగా రవాణా చేస్తున్నారని, ఈ రవాణాను అరికట్టేందుకు సారా బట్టీలను ధ్వంసం చేస్తున్నామని తెలిపారు. ప్రతి నెలా కనీసం మూడుసార్లు అంతర్‌రాష్ట్ర దాడులు నిర్వహిస్తామని చెప్పారు. రానున్న రోజుల్లో డ్రోన్ పరికరాలను ఉపయోగించి సారా తయారీ కేంద్రాలను గుర్తించి మరిన్ని దాడులు నిర్వహిస్తామన్నారు. ఈ దాడుల్లో ఏఈఎస్ జీవన్ కిశోర్, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల సీఐలు, ఎస్సైలు, సిబ్బంది ఒడిశా ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹220